www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం
ADIKAVI NANNAYA UNIVERSITY

తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య బట్టుగంగారావు
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :10 | 07-12-2020 | పుటలు : 4


## రీసెర్చ్‌లో మేధోసంపత్తి హక్కుల పాత్ర కీలకం



**మీడియా సెల్, 28.11.20** మేధో సంపత్తి హక్కులు పరిశోధనలో కీలకపాత్ర పోషిస్తాయని, పేటెంట్ అనేది ఇతరులను నిరోధించడానికి ఒక ఆవిష్కర్తకు చట్టం ఇచ్చిన ప్రత్యేక హక్కు అని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో శనివారం ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో "అకాడెమిక్స్ అండ్ రీసెర్చ్‌లో మేధో సంపత్తి హక్కులు" అనే అంశంపై వెబినార్‌ను నిర్వహించారు. ఈ వెబినార్‌కు కన్వీనర్‌గా వై.సుష్మప్రియ, సిరీస్ కోఆర్డినేటర్‌గా వై.మనోజ్ దేవా వ్యవహరించారు. దీనికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. పేటెంట్స్ ద్వారా ఆవిష్కరణలకు రక్షణ ఉంటుందని అన్నారు. కాపీరైట్ అనేది మానవ మేధస్సు యొక్క రచనలను రక్షించడానికి సంబంధించిన ఐ.పి.ఆర్ యొక్క ఒక రూపం అని తెలిపారు. పెయింటింగ్స్, శిల్పాలు, టెక్నాలజీ ఆధారిత రచనలు వంటి లలిత కళల రచనలు, కంప్యూటర్ ప్రోగ్రామ్‌లు మరియు ఎలక్ట్రానిక్ డేటా బేస్‌లు వంటి వాటిపై ఆవిష్కర్తలు హక్కులను సంపాధించుకోవాలని అన్నారు. విద్యాభ్యాసం, జ్ఞానాన్ని సృష్టించడం మరియు ఉన్నత సంస్థలలో అభివృద్ధికి తోడ్పడటం మరియు విద్యాపరమైన, పరిశోధనపరమైన ఆవిష్కరణలలో మేధో సంపత్తి హక్కులు తప్పనిసరిగా ఉపయోగపడతాయని తెలియజేసారు. తరువాత లా అండ్ జస్టిస్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ డా.జి.ఆర్.రాఘవేందర్, పోస్ట్ గ్రాడ్యుయేట్ అండ్ డాక్టరేట్ కౌన్సిల్ నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా చైర్ ప్రొఫెసర్ ఆచార్య టి.రామకృష్ణ, ఉస్మానియా యూనివర్సిటీ లా విభాగాచార్యులు జి.బి.రెడ్డి తదితరులు ఉపన్యసించారు. చక్కని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వహకులకు రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, విభాగాధ్యాపకులు ఎన్.శ్రీనివాస సుబ్బారావు, డా.ఎస్.రాజ్యలక్ష్మి, వి.రాజశేఖర్, ఆయా ప్రాంతాల నుండి అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధకులు పాల్గొన్నారు.

## క్రీస్తువాణి



"మన బయటి శత్రువు కన్నా లోపలి శత్రువు మనల్ని ఎక్కువ బల హీనపరుస్తాడు. కోపం, స్వార్థం, ఈర్ష్య బంధాలను తునాతునకలు చేస్తాయి. ఇది ఎప్పటికీ మంచిది కాదు. తనకు తానే వేరుపడిన ప్రతి రాజ్యం పాడైపోతుంది."

క్రీస్తు తన శిష్యునకు చెప్పిన ఉదాహరణ. అందు వలన మనలోని శత్రువును జయించి కలసి ఉండటం అనేది చాలా ముఖ్యమైనది.

## గురువులు నిబద్ధతతో పని చేయాలి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

గురువులు నిబద్ధతతో పనిచేయాలని విశ్వవిద్యాలయాన్ని విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథ రావు అన్నారు. విశ్వ విద్యాలయంలో గురువారం ఆర్ట్స్ అండ్ కామర్స్, ఇంజ నీరింగ్ మరియు ఎడ్యుకేషన్ కళాశాలలకు చెందిన అధ్యాపకులతో వీసీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించిన ఈ సమావేశంలో వీసీ మాట్లాడుతూ కోవిడ్‌కాలంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు ఎన్నో విద్య, విజ్ఞాన, సేవా కార్యక్రమాలను నిర్వహించారని అభినందనలు తెలిపారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు నాణ్యమైన విద్యను అందించడంలో గురువులు కీలక పాత్రను పోషించాలని నిత్య విద్యార్థిగా గురువు వ్యవహరించాలని చెప్పారు. నాక్ సాధనలో అధ్యాపకులు మరింత చురుగ్గా పని చేయాలని తెలిపారు. పరిశోధనలపై ప్రత్యేక దృష్టి సారించాలని పరిశోధన ప్రచురణలకు కొంత బడ్జెట్‌ను అందించేలా ప్రత్యేక పాలసీని తీసుకువస్తామని చెప్పారు. అడహక్ ఫ్యాకల్టీ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వేతనాలు పెంచేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. విభాగాల వారీగా రివ్యూ సమావేశాలు నిర్వహించి విద్యా విజ్ఞాన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటామని చెప్పారు. ఆయా విభాగాలకు చెందిన మంత్రిత్వ శాఖలతోనూ, సంస్థలతోనూ సంయుక్తంగా పనిచేస్తూ పరిశోధనపథంలో విశ్వవిద్యాలయాన్ని నడిపించాలని అన్నారు. విద్యార్థులకు మంచి వాతావరణంలో నాణ్యమైన విద్యను అందించి విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని తెలియజేశారు. తర్వాత రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు కళాశాలల్లోని విభాగాలను పరిశీలించారు.

### అనుబంధ కళాశాలలకు

## జెగేట్, జెస్టోర్ సేవలు

### వీసీ మొక్కా జగన్నాథరావు



జెగేట్, జెస్టోర్ సేవలను ప్రారంభిస్తున్న విసి

విద్యాపరమైన అభివృద్ధిలో భాగంగా జెస్టోర్, జెగేట్ సేవలను ఉభయగోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలో పరిశోధకులకు అందిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథ రావు అన్నారు. యూనివర్సిటీ ఈసీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై జెస్టోర్, జెగేట్ సేవలను అనుబంధ కళాశాలలకు షేర్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లోని పరిశోధకులను ప్రోత్స హించేందుకు విశ్వవిద్యాలయం అన్ని విధాల సహకారం అందిస్తుందని తెలియజేశారు. విశ్వవిద్యాలయానికి సంబంధించిన విద్యా పరమైన సేవలను అభివృద్ధి పరచడానికి జెగేట్, జెస్టోర్ సేవలను అందిస్తున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయంలో విద్యాపరమైన ప్రగతికి ఇవి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. పరిశోధనలు, పరిశోధన పత్రాలు, జర్నల్స్, ఆర్టికల్స్, ప్రచురణలు, పాఠ్యాం శాలు వంటి అన్ని అంశాలనూ జెస్టోర్ ద్వారా పొందవచ్చునని చెప్పారు. దీనిలో లక్షా 50 వేలకు పైగా అర్టికల్స్, 5 వేలకు పైగా జర్నల్స్‌ను సద్వినియోగం చేసుకోవచ్చునని తెలిపారు. ముఖ్యంగా 59 పాఠ్యాంశాలకు సంబంధించిన సమాచారం జెస్టోర్ ద్వారా పొందుకోవచ్చునని అన్నారు. ఇప్పటికే విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం క్యాంపస్‌తో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లకు చెందిన వారు దీనిని ఉపయోగించుకుంటున్నారని అన్నారు. ఈ సేవలను మరింత విస్తృత పరచాలనే ఆలోచనతో, విజ్ఞానాన్ని అందరికీ అందించాలనే ఉద్దేశంతో గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల పరిశోధకులకు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, లైబ్రరీ కోఆర్డినేటర్ డా.కె.రమణేశ్వరి, ఆచార్య ఎస్.టేకి, డా.టి.సింహాచలం, ఆదిత్య శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

### ప్రేమ
### మనమే మనకు
### ముఖ్యమైన వ్యక్తి !

**అవును! మనల్ని మనం ప్రేమించుకోవాలి.**

మనుషుల్ని ప్రేమించాలి. వస్తువుల్ని వాడుకోవాలి. కర్తవ్యాన్ని ప్రేమించాలి. అలసత్వాన్ని వదులుకోవాలి. దురదృష్టం ఏమిటంటే... ప్రస్తుతం వస్తువుల్ని ప్రేమిస్తూ మనుషుల్ని విపరీతంగా వాడుకునే తరం నడుస్తుంది. సెల్ ఫోన్‌కి, బ్యాగ్‌కి, బైక్‌కి, కారుకి చిన్న గీత పడితే, సొట్ట పడితే రక్తపోటు పెరిగిపోతున్న తరం ఇప్పుడు నడుస్తోంది. విలువైన సున్నితమైన వస్తువుల్ని ఖరీదు పెట్టి కొని, వాటికి సేవలు చేస్తూ, వాటిని ప్రేమిస్తూ, వాటికి కాపలా కాసే తరం నడుస్తోంది.

బాల్యంలో ఇరవై రూపాయలు ఖరీదు చేసే మ్యూజిక్ సెల్‌ఫోన్, ప్లాస్టిక్ కారు విరిగిపోయినప్పుడు పిల్లవాడు ఏడుస్తాడు. రెండు వేల ఖరీదైన బ్యాటరీ రిమోట్ కారు పోయినప్పుడు కూడా అంతే. లక్షల ఖరీదైన కారు గీత పడినప్పుడు కూడా అంతే. బీపి పెరిగిపోతుంది. విపరీతమైన ఒత్తిడి, ఆందోళన వీటితో అనారోగ్యం కూడా పెరిగిపోతుంది.

వస్తువుల, సౌకర్యాల స్థాయి పెరిగింది. మనిషి వేదన మాత్రం బాల్యం నుండీ అదే స్థాయిలో కొనసాగుతోంది. చిన్నప్పటి ఆటబొమ్మలు వినోదం కోసం. ఇప్పుడున్న అధునాతన యంత్రాలన్నీ సౌకర్యం కోసం. వాటికోసం బాధపడటం, బెంగపడటం, కన్నీటిని జారవిడవటం, ఇతరులను నిందించడం, గొడవపడటం అనారోగ్య హేతువే.

మనిషి మాట, అనుబంధం, ఆప్యాయత, ప్రేమ, మంచితనం.... ఇవి మార్కెట్లో దొరికేవికావు. మన దినచర్య లోని వస్తువుల కన్నా మనం, మన చుట్టూ ఉన్న మనుషులు చాలా ముఖ్యమైనవాళ్ళు. చాలా చాలా ముఖ్యమైన వాళ్ళు. వీళ్ళు మనకు ఎలా ఉపయోగపడతారని, వీళ్లను మనం మన సొంత పనులకు ఎలా వాడేసుకోవచ్చనే ఆలోచనా ధోరణి వలన మనకు ముందుగా బద్ధకం, అనారోగ్యం మొదలవుతుంది. చివరికి మన పనులు మనం చేసుకోలేని మనుషులుగా మారిపోతాం. సంకుచితమైన గోడల మధ్య మనసులు పెలుసు బారిపోతాయి. అంతకన్నా ముఖ్యమైన విషయం ఇతరుల మనసులో మన స్థాయి అధమమైందిగా నిర్ణయింపబడి ఉంటుంది.

అన్ని విషయాల కన్నా ముందుగా మనకు మనమే ఎక్కువ.. అని భావిస్తున్నప్పుడు మనల్ని మనం ఎంతగా ప్రేమిస్తున్నామో... ఇతరుల విషయంలో కూడా అంతే. ఇందులో ఏమాత్రం సంశయం లేదు.

**దయచేసి వస్తువుల్ని వాడుకుందాం.**

**మనుషుల్ని ప్రేమిద్దాం.**




### ఆధ్యాత్మిక వాణి

### ఆధ్యాత్మిక రూపం..
### కార్తిక దీపం

# మాల్గుడి డేస్ పుస్తకం



**- ఆర్.కె.నారాయణ్**




మాల్గుడి అనేది ఒక ఊహా జనిత గ్రామం. ఒక జిల్లాకో, ఒక రాష్ట్రానికో, ఒక దేశానికో చెందింది కాదు మాల్గుడి. ప్రపంచంలోని ప్రతీ దేశంలో మనకు సగటు మనిషి, సగటు ప్రపంచం, సగటు మనస్తత్వాలు, సగటు జీవన సరళి, సగటు బాధలు యితని రచనలో మనకు కనిపిస్తాయి. ఇందులో మనకు 32 కథలు ఉన్నాయి. అన్నింటి గురించి ఇక్కడ సమీక్షను వ్యక్త పరచడం సాధ్యం కాదు. అందుకే ఒకటి మచ్చుకు పరిశీలించండి

**జ్యోతిష్కుడి జీవితం లో ఒక రోజు :**

ఇందులో కథను పక్కకి పెడితే సాధారణంగా మనకు కనపడే చిలక జ్యోతిష్కులు ప్రశ్నలకు రూపంలో మనకు చెప్పే జ్యోతిష్యం ఇలా ఉంటుంది. మీరు చాలా కష్టాల్లో ఉన్నారు. మీ చుట్టూ కష్టాలు పొంచి ఉన్నాయి. మీ బంధువుల్లో మీకు శత్రువులున్నారు కదా. మీ దగ్గరి వాళ్లు మీ భవిష్యత్తు గురించి భాద పడుతున్నారు కదా. మీ సంతానమే మీకు సమస్య..... ఇలాంటివి చాలా ఉంటాయి. ఇవి సాధారణంగా ప్రతీ కుటుంబంలో ఉండేవే. ఇక్కడే మనం తిరిగి చెప్పే సమాధానాన్ని బట్టి మనకు జోష్యం చెప్తాడు. ఇక్కడే మనం బోల్తా పడేది.

ఇలాంటి కథలే మనకు ఇతని రచనల్లో కనిపిస్తాయి. మన చుట్టూ మనకు తెలిసో, తెలియకో జరిగే సంఘటనలని కథల రూపంలో చూపిస్తాడు రచయిత. ఇతను రాసిన ఈ మాల్గుడి డేస్ కథలు ఒకప్పుడు ఢిల్లీ దూరదర్శన్ tv ఛానల్ లో సీరియల్‌గా వచ్చాయి. ఇప్పటికీ ఈ కథలకు ఉన్న ఆదరణ తగ్గలేదు అంటే ఇవి సామాన్యుడి జీవితానికి ఎంత దగ్గరగా ఉన్నాయో ఊహించండి




# 2020లోనే ఐ.ఎస్.ఓ సర్టిఫికేషన్ సాధించాలి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

2020వ సంవత్సరంలోనే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఐ.ఎస్.ఓ సర్టిఫికేషను సాధించేందుకు సిబ్బంది అంతా చురుగ్గా పని చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ స్థాయిలో ఐ.ఎస్.ఓ మేనేజ్మెంట్ రివ్యూ నిర్వహించారు. దీనికి చైర్మన్‌గా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథ రావు, మేనేజ్మెంట్ రిప్రజెంటేటివ్స్‌గా ఆచార్య కె.శ్రీ.రమేష్, డా.కె.వి. స్వామి వ్యవహరిం చారు. ఐఎస్ఓ కోఆర్డినేటర్ డా.వి.పెర్సిస్ రిపోర్ట్‌ను ప్రజెంట్ చేశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ 2020 నాటికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాల యానికి ఐఎస్ఓ గుర్తింపును సాధించాలనే లక్ష్యంతో పని చేయాలని చెప్పారు. నవంబర్ 25వ తేదీన మొదటిదశ ఇంటర్నల్ ఆడిట్ ప్రక్రియను ఐఎస్ఓ బృందం నిర్వహించడం జరిగిందని తెలిపారు. వాటిలోని లోటుపాట్లను నివృత్తి చేసుకుంటూ డిసెంబర్ 14, 15 తేదీల్లో రెండో దశ ఆడిట్‌ను నిర్వహించాలని చెప్పారు. విశ్వవిద్యాలయ నాణ్యత ప్రమాణాలను తెలుసుకొనేందుకు ఈ అంతర్గత ఆడిటింగ్ ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు. ఐఎస్ఓకు సంబంధించిన 12 అంశాలను దీనిలో చర్చించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇంటర్నల్ ఆడిట్ అండ్ మేనేజ్మెంట్ రివ్యూ జరగాలని వీసీ తెలియజేశారు. లక్ష్య సాధనకు సమయం చాలా తక్కువగా ఉందని సమష్టి కృషితో పనిచేసి ఐఎస్ఓ గుర్తింపును సాధించాలని పిలుపునిచ్చారు.

# వేగవంతమైన పరిపాలన అందిస్తాం

యూనివర్సిటీ కాలేజ్ డెవల ప్మెంట్ కౌన్సిల్ మరియు డీన్ అకడమిక్ అఫైర్స్‌లు విశ్వవిద్యాలయానికి వెన్నుముక వంటివని వీటిని పటిష్ట పరిచి వేగవంతమైన సేవలను అందిస్తామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ మరియు డీన్ అకడమిక్ అఫైర్స్ కార్యాలయాలను విశ్వ విద్యాలయ కేంద్ర పరిపాలనా భవనం నుండి ఆధునిక హంగులతో రూపొం దించిన ఎమెనిటీస్ సెంటర్లోనికి బుధ వారం మార్చడం జరిగింది. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లా డుతూ విశ్వవిద్యాలయ పరిపాలనను వేగవంతం చేసేందుకు అన్ని విధాల ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఉభయ గోదావరి జిల్లాలోని సుమారు 400లకు పైగా కళాశాలలతో రాష్ట్రంలోని అతిపెద్ద విశ్వవిద్యాలయంగా ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఎంతో బాధ్యత ఉంటుందని గుర్తు చేశారు. దానిని కాపాడుకుంటూ సమగ్రమైన పరిపాలనను అందించడానికి అందరూ సహకరించాలని చెప్పారు. ఉభయగోదావరి జిల్లాల్లోని డిగ్రీ మరియు పీజీ కళాశాలలకు సంబంధించిన అన్ని వ్యవహారాల యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ పరిధిలోకి వస్తాయని వాటిని సత్వరమే పరిష్కరించే వ్యవస్థను సిద్ధం చేయాలని సూచించారు. విద్యాపరమైన అన్ని వ్యవహారాలనూ నాణ్యతగా, సులభతరంగా అందించేందుకు సమగ్రమైన విధానాన్ని రూపొందించాలని అకడమిక్ అఫైర్స్ వారికి తెలియజేశారు. విశ్వవిద్యాల యంలో కీలక పాత్ర పోషించే అకడమిక్ అఫైర్స్ మరియు కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ ఒకదానికొకటి సమన్వయంగా పనిచేసి నాణ్యమైన, సులభమైన, పటిష్ట మైన పరిపాలనను అందించేందుకు కృషి చేయాలని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు రెండు కార్యాలయాల అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య వై.శ్రీనివాసరావు, డీన్ సిడిసి డా.ఎం. కమలకుమారి, అసిస్టెంట్ డీన్స్ డా.పడాల రాజశేఖర్, డా. ఎం. గోపాలకృష్ణ, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు మరియు అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, విశ్వవిద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు



# విద్యార్థి లోకం

## ప్రతిభా వాణి



## కందుకూరి వీరేశలింగం

**16 - 4 -1848 / 27 -5- 1919**

తన దేహం(శరీరం), తన దేహం (ఇల్లు), తన కాలము, తన ధనం, తన విద్య జగజ్జనులకు వినియోగించిన ఘనుడీ వీరేశలింగకవి జనులారా!! ...అని చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు ఈ ఒక్క పద్యంలోనే వీరేశలింగం గారి జీవిత చరిత్ర చక్కగా చెప్పారు. ఈ మాటలు అక్షర సత్యాలు. బ్రహ్మర్షులు, ఆంధ్ర కేసరులు, దేశభక్తులు, విశ్వదాతలు, కాంగ్రెస్ చరిత్రకారులు, గ్రంథాలయ పితామహులు.... ఒకరేమిటి గడచిన రెండు పురుషాంతరాలలోని మహా పురుషులందరూ వీరేశలింగంగారి అడుగుజాడలలో నడిచిన వారే. సామాజిక వ్యవస్థను సరిదిద్దిన కందుకూరి నిస్సంశయంగా యుగపురుషుడు. తన కాలం నాటి సామాజిక అన్యాయాలను, దురాచారాలను రూపుమాపడానికి పత్రికలను, సాహిత్యాన్ని ఔషధంగా వాడిని కవి సంస్కర్త. మహిళాభ్యుదయాన్ని కాంక్షించి కృషిచేసిన దీక్షాదక్షుడు వీరేశలింగం. రాజమహేంద్రవరాన్ని కార్యక్షేత్రంగా చేసుకుని తెలుగునాట ఆయన చేసిన సంఘ సంస్కరణకు సమాజం గతానుగతంగా సాగిపోవటం మాని ఆగి ఆలోచించటం మొదలు పెట్టింది. వర్తమాన సామాజిక ప్రపంచంలో అన్ని రంగాల్లోనూ మహిళలు ఉండటానికి ఇటువంటి సంఘసంస్కరణ సిద్ధాంతాలు కారణమని చెప్పవచ్చు. నవయుగ వైతాళికుడైన ఈ ప్రతిభావాణికి అక్షర నీరాజనం!!


## ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలిద్దాం : వీసీ జగన్నాథరావు




ఎన్‌ఎస్‌ఎస్ ర్యాలీని ప్రారంభిస్తున్న వీసీ జగన్నాథరావు

ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించడంలో యువత కీలక పాత్రను పోషించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథ రావు అన్నారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచదేశాలను వణికించిన మహమ్మారి ఎయిడ్స్ అని అన్నారు. గణాంకాల ప్రకారం ఎయిడ్స్ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. ఎయిడ్స్ నిర్మూలనకు యువత పాటుపడాలని, ప్రజలందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. నిరక్షరాస్యులైన ప్రజలకు ఇటువంటి వ్యాధులపై ఏ మాత్రం అవగాహన ఉండడం లేదని చెప్పారు. స్వల్పకాల సుఖం కోసం శాశ్వత జీవితాన్ని కోల్పోతున్నారని తెలిపారు. సమాజాన్ని సమగ్రమైన మార్గంలో తీర్చిదిద్దే గల సామర్థ్యం యువతకు ఉందని తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డా. బి. కెజియారాణి, ప్రోగ్రాం అధికారులు రాహుల్, పద్మవల్లి, ప్రసాద్, విశ్వవిద్యాలయ ప్రాంగణ కళాశాల విద్యార్థులు దీనిలో పాల్గొన్నారు.

## అభినవ దేవాలయం.. మా నన్నయ విశ్వవిద్యాలయం



### స్ఫూర్తి

సుందర గోదావరి తీరాన చారిత్రాత్మక నగరమైన రాజమహేంద్రవరానికి వన్నే తెచ్చే విధంగా వాగనుశాసనుడైన ఆదికవి నన్నయ పేర వెలసి మా జీవితాలకు వెలుగు నింపిన అభినవ దేవాలయం మా ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం.

అంకిత భావం, నిబద్ధత గల అధ్యాపకులు, చక్కని ప్రాంగణం, సువిశాలమైన గ్రంథాలయం కలిగి ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థులకు అందుబాటులో ఉన్నత విద్యను అందిస్తున్న మా నన్నయ విశ్వవిద్యాలయం అన్నయలా నాకు దారి చూపింది.

నేను 2009 సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ(మేథమెటిక్స్ & కంప్యూటింగ్)లో చేరి 2014లో పూర్తిచేశాను. ఆ సమయంలో హెచ్ఓడి డా॥ జి.గణేషన్ గారు చదువుతో పాటు ఆటలు, ఇతర కరిక్యులర్ యాక్టివిటీస్‌లో ఎంతో ప్రోత్సహించే వారు. మా ఫ్యాకల్టీ డా॥ టి.హైమావతి గారు, డా॥ బి.శంకర్‌రావు గారు మాకు మేథమెటిక్స్ విషయంలో చక్కని తోడ్పాటు నందించి మా విజయానికి బాటలు వేశారు. నాకు ఎంతో సహాయ సహకారాలు అందించిన డా॥ బి.శంకర్ రావు గారు, డాక్టర్ అర్చనా రఘువంశీ మేడమ్ గారు వీరిద్దరి అకాల మరణం నన్ను ఎంతగానో బాధించింది.

అదే విధంగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని మాకు చక్కగా అందించి ముందుకు నడిపించిన డా॥ పి.వెంకటేశ్వరరావు గారు, డా॥ డి.లతా మేడం గారికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకొంటున్నాను.

అప్పటి ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్‌గా ఉన్న డా॥ బి.జగన్మోహనరెడ్డి గారు మాకు ఎన్.ఎస్.ఎస్ ద్వారా సేవాభావాన్ని కలిగించి, మాలో జాతీయ భావాన్ని పెంచారు.

అప్పటి పీడీ గారైనా శ్రీ ఎ.సత్యనారాయణ గారు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విషయంలో మా విజయానికి నిరంతరం కృషి చేసేవారు. ఇప్పటి పీడీ గారైనా డా॥ బి.రాంగోపాల్ గారు కూడా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విషయంలో ఎంతో ప్రోత్సాహాన్ని అందించి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నారు వారికి నా ధన్యవాదాలు.

మా నాన్న గారు స్థానిక ఎస్.కే.వి.టి లో ఉపాధ్యాయులుగా పనిచేయుచున్నారు. వారి ప్రోత్సాహంతో ఎమ్మెస్సీ అయిన తరువాత ఎడ్‌సెట్ వ్రాయగా మంచి ర్యాంక్ వచ్చినందున, నా అదృష్టం కొద్దీ మరలా ప్రాంగణంలో బిఎడ్ చదివే అవకాశం కలిగింది. అప్పటి యూసీఎడ్ ప్రిన్సిపాల్ గారైన డా॥ కె.సుబ్బారావు గారు మమ్ము ఎంతో ప్రోత్సహించారు. డా॥ ఎమ్.గోపాలకృష్ణ గారు మరియు డా॥ ఆర్.ఎస్.వరహాల దొర గారు సైకాలజీ సబ్జెక్ట్ బోధిస్తూ పిల్లల మనస్తత్వం, వారితో ఏ విధంగా మెలగాలో చక్కగా బోధించారు.

డా॥ ఆర్.సాంబశివరావు గారు మేథమెటిక్స్ మేథడాలజీ బోధించగా, డా॥ ఎన్.సుజాత మేడం గారు ఇంగ్లీష్ మేథడాలజీ లోని మెళుకువలను చక్కగా తెలియజేశారు. డా॥ వి.రామకృష్ణ గారు, డా॥ జి.ఎలీషాబాబు గారు, డా॥రాజేశ్వరి గారు, డా॥రాజమణి మేడం గారు మాకు బీఈడీ లోఇతర సబ్జెక్ట్స్ బోధించి మా విజయానికి ఎంతో సహాయ సహకారాలు అందించారు.

బోధనేతర సిబ్బంది ఆఫీస్ విషయంలో ఎంతో సహాయ సహకారాలు అందించారు. మరీ ముఖ్యంగా శ్రీ కె.శ్రీనివాస్ గారు తన సొంత తమ్ముడిగా చూసేవారు.

బియడ్ పూర్తి చేసిన తరువాత టీచింగ్ మీద మక్కువతో ఎస్ కేవీటీ[m] ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడి గా పనిచేస్తూ డి యస్ సి కి ప్రిపేర్ అయ్యాను, అదే సమయంలో వివిధ రకాల పోటీ పరీక్షలు వ్రాసి అతి తక్కువ మార్కుల వ్యత్యాసం తో విఫలమైనా,నిరుత్సాహ పడకుండా మా నాన్న గారి ప్రేరణతో(ఓటమిని అంగీకరించు సమయాన్నివృధా చెయ్యకు, ఓటమి తోనే గెలుపు వస్తుంది) కాలాన్ని వృధా చెయ్యకుండా ప్రిపేర్ అయ్యాను. వరుసగా గ్రామ సచివాలయం లో వెస్ట్ గోదావరి జిల్లా : వెల్ఫేర్ & ఎడ్యుకేషన్ అసిస్టెంట్ , కృష్ణా జిల్లా: వార్డ్ ఎడ్యుకేషన్ & డేటా ప్రాసెసింగ్, శ్రీకాకుళం జిల్లా: పంచాయతీ కార్యదర్శి గా ఎంపిక అయ్యాను. ఎందరో మహానుభావులైన మా విశ్వవిద్యాలయం ఆచార్యుల ప్రోత్సాహ స్ఫూర్తితో,నా తల్లిదండ్రుల ఆశీస్సుల తో డియస్సి 2018 లో స్పోర్ట్ క్వాటా లో స్కూల్ అసిస్టెంట్ (మేథమెటిక్స్) గా ఎంపిక కాబడి కోరుకొండ మండలం,బోల్లెద్దుపాలెం, జెడ్ పి హై స్కూల్ లో ఉపాధ్యాయునిగా పనిచేయుచున్నాను. నా అభివృద్ధి కి సహకరించిన విశ్వవిద్యాలయానికి, నన్ను ప్రోత్సహించిన బోధన, బోధనేతర సిబ్బందికి సర్వదా కృతజ్ఞుడను.

**- నన్నయ పూర్వ విద్యార్థి కె.యస్.ఎన్.ప్రవీణ్**
**స్కూల్ అసిస్టెంట్ - జెడ్‌పి హై స్కూల్,**

### మంచి మాట

" నైతిక విలువలను కాపాడే బాధ్యత ఉపాధ్యాయులదే. ఉపాధ్యాయుడు ఉద్యోగి మాత్రమే కాదు, సమాజ నిర్మాత, మంచి ఉపాధ్యాయుడు ఒక సామాజిక వైద్యుడు కూడా "

– బెట్రెండ్ రస్సెల్



**కె.సృజిత, ఎంఎస్‌సి బయోకెమిస్ట్రీ,**
**2020 అవుట్ గోయింగ్ బ్యాచ్**

గ్రంథాలయ వాణి



# సరస్వతీ సామ్రాజ్యం

పుస్తకాలు – కాల సాగర తీరాన
దారి చూపు లైట్ హౌస్లు!
పుస్తకాలు – హస్త గత
సుందరోద్యాన వనాలు!
పుస్తకాలు – అనర్ఘ కోశాగారాలు!
పుస్తకాలు – ఆత్మకి ఔషధాలు!!

**- ఆచార్య పొన్నపల్లి శ్రీరామారావు**

గ్రంథాలయాధికారి, సిబ్బంది
పుస్తకాలకు కాపలా కాసేవారిగా
ఉండకూడదు.... అభిమానంతో
అతిథ్యమిచ్చే గృహస్తులా ఉండాలి

**- రవీంధ్రనాథ్ ఠాగూర్**

చిరిగిన చొక్కా అయినా తొడుక్కో
కానీ మంచి పుస్తకం కొనుక్కో !!

**- కందుకూరి వీరేశలింగం.**

**పొచ్చెములు (విభేదాలు) లేని నేస్తములు పుస్తకాలు**

గ్రంథాలయపు అరల్లో
నిధులు నిద్రిస్తున్నాయ్
ముట్టుకుని చూడు
తళుక్కున మెరుస్తాయ్.

**- ఆచార్య ఎన్. గోపి.**

**ఒక పుస్తకాన్ని పట్టుకుని చదవటమంటే ఒక మహా రచయితతో మనం సంభాషించినట్లు.**

కొన్ని పుస్తకాల్ని రుచిచూడాలి.
కొన్నింటినిమ్రింగాలి.కొన్నిటిని
బాగానమలి జీర్ణించుకొని
నెమరువేసికొనాలి.

**- ఫ్రాన్సిస్ బేకన్**

**మహర్షుల మహానుభావుల మేధని మనమేధకి మేతచేసేవే పుస్తకాలు!**

మహాగ్రంథం మహాకవి రక్తంతో
వ్రాయబడుతుంది

**- మిల్టన్**

**అర్థంచేసికోగల్గితే- ప్రతివ్యక్తి ఒక ఉద్గ్రంథమే!**



## విజ్ఞాన భాండాగారంగా తీర్చిదిద్దుతున్నాం



ఉపకులపతి వర్యులు ఆచార్య మొక్క జగన్నాథరావు గారి ప్రోత్సాహంతోవారి విజన్ ప్రకారం గ్రంథాలయాన్ని గొప్ప విజ్ఞాన భాండాగారంగా తీర్చిదిద్దుతున్నాం. రీడింగ్ రూమ్ ఏర్పాటు ఫ్యాకల్టీ రీసెర్చ్ స్కాలర్స్‌కి విద్యార్థులకు ప్రత్యేకమైన అధ్యయన నిలయాలు ఏర్పాటు చేశాం. జెస్టోర్స్, జెగేట్ వసతిని, అన్ని విభాగాలకు చెందిన జర్నల్స్ అందుబాటు లోకి తీసుకొచ్చాం. అన్ని రకాల పోటీ పరీక్షలకు కొత్త పుస్తకాలు నిరంతరం అందుబాటులో ఉంచుతున్నాం. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలంటే వారికి ప్రత్యేక స్థానాన్ని కలిగించి వారికి కావలసిన సౌకర్యాలను గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తున్నాం. అన్ని విభాగాల విషయాలకు సంబంధించి 20 వేల రిఫరెన్స్ బుక్స్ అందుబాటులో ఉన్నాయి. అలాగే విద్యార్థుల కోసం దాతలు అందించిన పుస్తకాలు ఐదు వేల వరకూ అందుబాటులో ఉన్నాయి. మారుతున్న సిలబస్ ననుసరించి ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలు విద్యార్థులకు, పరిశోధకులకు అందుబాటులో ఉంచుతున్నాం. గ్రంథాలయం లో అందరూ దర్శించేలా భారత రాజ్యాంగ ప్రతిని ప్రత్యేక స్థానంలో ఏర్పాటుచేశారు. ఉభయగోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలల పరిశోధకులకు జేస్టోర్, జేగేట్ సేవలను అందిస్తున్నాం.

**డా.కె.రమణేశ్వరి**
**సమన్వయకర్త విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయం**



మనిషి జీవితం సహజంగా మహిమాన్వితమైంది. పుస్తక జ్ఞానం వలన మనిషికి ఆత్మజ్ఞానం కలిగి ఆత్మ విశ్వాసం కలుగుతుంది. మనిషి జీవితం కురుక్షేత్రం లాంటిది. పుస్తక జ్ఞాన సముపార్జనతో అతడు దానిని ధర్మ క్షేత్రం గా మార్చుకుంటాడు. గ్రంథాలయాలు మనిషిని జ్ఞానిగా, కర్మ వీరునిగా, త్రిగుణాతీతమైన వ్యక్తిగా, జితేంద్రియునిగా, స్థితప్రజ్ఞునిగా, మహనీయునిగా తీర్చిదిద్దుతాయి. మనిషి మనీషి అవుతాడు. సామాన్యుడు మాన్యుడవుతాడు. మహాత్ముడవుతాడు. ధీరోదాత్తుడై సమాజ సర్వతోముఖాభివృద్ధికి దోహద పడతాడు.

విశ్వవిద్యాలయ ప్రాంగణంలో చదివే విద్యార్థిని తీర్చిదిద్దే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయం నన్నయ విశ్వవిద్యాలయానికి హృదయం లాంటిది.



నిత్య
విజ్ఞాన దీపికల్ నిండి
వెలుగు,
పుస్తకాలయముల మాతృ
పూజనెపుడు,
సప్రదక్షణ నియతమై సలుపు
నెవడు ,
అతడు అజ్ఞాన దాస్యము
నవల ద్రోయు!!

**- రాయప్రోలు సుబ్బారావు**

మొదటిసారి
మంచి పుస్తకాన్ని
చదివినప్పుడు కొత్త స్నేహితుని
సంపాదించుకున్న వానివలె,
రెండవ సారి చదివినప్పుడు పాత
స్నేహితుని కలుసుకున్నట్లు
ఆనందం కలిగింది.

**- గ్లాడ్ స్టన్**









## డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం

వీసీ గారి సహాయ సహకారాలతో విద్యార్థులకు అన్ని విధాల విశ్వ విద్యాలయం విజ్ఞాన భాండాగారంలా ఉండేలా, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు కృషిచేస్తున్నాం. విద్యార్థులకు అవసరమయ్యే అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నాం

**టి.సింహాచలం**
**సహాయ గ్రంథాలయాధికారి**



